ప్రత్యేక పూజలు



పూజల్లో మంత్రి కొండా సురేఖ, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్

అబిడ్స్: బేగంబజార్ జగన్నాథ ఆలయ పునర్నిర్మాణ పనులకు, గోశాల నిర్మాణానికి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ఆలయంలో మహంత్ అమృత్‌దాస్ మహారాజ ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. మంత్రి కొండా సురేఖ ముఖ్యఅతిథిగా హాజరై పూజలు ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..జగన్నాథ ఆలయంలో గోశాలను ఏర్పాటు చేసేందుకు సన్నహాలు ప్రారంభిస్తున్నట్లు ఎంతో సంతోషకరమన్నారు. గోశాలల అభివృద్ధికి అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పరమేశ్వరీ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సత్కళాభారతి ఆధ్వర్యంలో న్యాయవాది ఎస్.కిషన్‌రావు రచించిన 'కవనం నా ఊపిరి'అనే పుస్తకావిష్కరణ సభ సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ..న్యాయవాద వృత్తిలో ఉంటూ రచయితగా కొనసాగడం ఎంతో అభినందనీయమన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ నిత్యానందరావు, సాహితీవేత్తలు ఆచార్య ఎస్వీ రామారావు, ఓలేటి పార్వతీశం, విజయరామారావు, సంస్థ అధ్యక్షులు సత్కళాభారతి సత్యనారాయణ పాల్గొన్నారు.

కేన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నివారించవచ్చు



గన్‌ఫౌండ్రీ: కేన్సర్ అనేది ఒక వైద్య సమస్య మాత్రమే కాదు జీవితలను మార్చివేసే ఒక యదార్థమని ద గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ చిన్నబాబు సుంకవల్లి అన్నారు. కేన్సర్‌ను ముందుగా గుర్తిస్తే చికిత్స చేయవచ్చని, పూర్తిగా కోలుకోవచ్చని తెలిపారు. సోమవారం అబిడ్స్‌లోని స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ద గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు వచ్చే కేన్సర్‌పై అవగాహన, పరీక్షల నిర్వహణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మహిళల్లో గర్భాశయ, స్థన, అండాశయ కేన్సర్‌లు సర్వసాధారనంగా వస్తుంటాయని సరైన సమయంలో పరీక్షలు చేయించుకుంటే నివారించవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 159 మంది మహిళలకు వైద్యులు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యప్రసాద్, కార్యదర్శి కృష్ణారావు, మేనేజ్‌మెంట్ సభ్యులు ప్రదీప్‌రెడ్డి, రాకేష్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎ.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.7 వేలు లంచం తీసుకున్న వ్యక్తి రిమాండ్

సిటీ కోర్టులు: ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ కాపీపై సంతకం పెట్టడానికి రూ.7 వేలు లంచం డిమాండ్ చేసిన సీనియర్ అసిస్టెంట్ ఆఫీసర్‌కి నాంపల్లిలోని ఏసీబీ కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఆర్మూర్‌లోని పంచాయతీరాజ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్.శ్రీనివాస్‌శర్మ ఓ వ్యక్తికి సంబంధించిన ఫండ్ ట్రాన్స్‌ఫర్ పత్రాలపై మునుపటి ఈఈ, పీఆర్ ఆర్మూర్(ప్రస్తుత నిజామాబాద్) సంతకం పెట్టడానికి శ్రీనివాస్‌శర్మ అతని నుంచి రూ.7500 లంచం డిమాండ్ చేశాడు. దీంతో ఫిర్యాదుదారుడి అభ్యర్థన మేరకు రూ.7000 ఒప్పుకోగా ఏవో టేబుల్ మీద పెట్టాడు. సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు రూ.7 వేలు సీజ్ చేయడంతోపాటు నిందితుడు శ్రీనివాస్ శర్మను అరెస్ట్‌చేసి సోమవారం నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో హాజరుపర్చారు. దీనిపై విచారణ చేపట్టిన 2వ అదనపు స్పెషల్ ఏసీబీ కోర్టు నిందితుడికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.

అధ్వానంగా పబ్లిక్ నల్లాల నిర్వహణ

- పబ్లిక్ నల్లాలను పట్టించుకోని అధికారులు
- ఇళ్ల ముందు ఉన్న నల్లాలను కబ్జా చేస్తున్న ఇంటి యజమానులు



లంగర్‌హౌస్‌లో పబ్లిక్ నల్లా నీరు పట్టుకుంటున్న ప్రజలు

గోల్కొండ: పేదల కోసం గతంలో ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి పబ్లిక్ నల్లాలు ఏర్పాటు చేసింది. మొదట్లో వీటి నిర్వహణకు సిబ్బంది కూడా ఉండేవారు. ఇంట్లో నల్లా పెట్టుకునే స్థోమత లేని వారు పబ్లిక్ నల్లాలపైనే ఆధారపడే వారు. బస్తీలు, కూడళ్లతో పాటు ఎక్కువ మంది నల్లా నీరు పట్టుకునే వీలు ఉన్న ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల్లో నల్లాల చుట్టూ రక్షణగా మూడు అడుగుల ఎత్తుగల ప్రహరీని కూడా వేశారు. అయితే పరిస్థితులు మారుతున్నా కొద్ది పబ్లిక్ నల్లాల నిర్వహణ కూడా మారింది. పబ్లిక్ నల్లాలను పర్యవేక్షించే సిబ్బంది లేకుండాపోయారు. ప్రస్తుతం బల్దియా వారు పబ్లిక్ నల్లాల నిర్వహణ తమది కాదంటున్నారు. మరో వైపు జలమండలి వారు కూడా వీటి నిర్వహణ పట్టించుకోవడం లేదు. దీంతో పబ్లిక్ నల్లాల నిర్వహణ గాలికి వదిలేసినట్లు అయింది.

నల్లాలను తీసి..చదును చేసి..

కార్వాన్, లంగర్‌హౌస్, నానల్‌నగర్ తదితర ప్రాంతాల్లో గతంలో వేసిన ఎన్నో పబ్లిక్ నల్లాలు నేడు కానరావడం లేదు. రెండు దశాబ్దాల క్రితం బస్తీలుగా ఉన్న ప్రాంతాలు నేడు బహుళ అంతస్తుల భవనాలతో కాలనీలను తలపిస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో తమ ఇంటి ముందు ఉన్న నల్లాలను తీసి ఆ ప్రాంతాన్ని చదును చేసి కబ్జా చేసుకున్నారు.



గోల్కొండ బడాబజార్‌లోని ఓ పబ్లిక్ నల్లా వద్ద కుళ్లిన వ్యర్థాలు

ఇదిలా ఉండగా ప్రధాన రహదారులకు ఆనుకొని ఉన్న నల్లాలు మాత్రమే నేడు తాగునీరు అందిస్తున్నాయి. అయితే వీటి పరిసరాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి. బకెట్లల్లో చెత్తను తెచ్చి కొందరు పబ్లిక్ నల్లా ప్లాట్‌ఫామ్‌ల వద్దే వేస్తున్నారు. దీంతో నల్లా నీటికి ఆ చెత్త కాస్తా కుళ్లి దుర్గంధం వస్తుంది. ఈ దుర్గంధం భరించలేక మహిళలు నీటిని పట్టుకోవడానికి పబ్లిక్ నల్లాకు రావడం లేదు. అయితే ప్రస్తుతం పని చేస్తున్న పబ్లిక్ నల్లాలకు నల్లా వచ్చే సమయంలో మాత్రం స్థానికులు క్యూలు కట్టి మరి నీటిని పట్టుకుంటున్నారు.

గాయబ్ అయిన పబ్లిక్ నల్లాల ప్రాంతాలు ఇవే...

టోలిచౌకి చౌరస్తా, ఎండిలైన్స్, కంపెనీ బాగ్, కార్వాన్ మెయిన్ రోడ్డు, టోలిచౌకీ అక్బర్ బాగ్, యాదవ బస్తీ, గోల్కొండ ఖాజీ గల్లీ.

ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి..



తాగునీటి కష్టాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తాగునీటిని ప్రైవేటు వ్యక్తుల నుంచి కొనితాగే స్థోమత పేదలకు లేదు. నిరుపేదల బస్తీల్లో నేడు ఎన్నో పబ్లిక్ నల్లాలు నిర్వహణ లోపంతో అధ్వానంగా తయారయ్యాయి. వీటన్నిటికీ మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. జలమండలి, బల్దియా అధికారులు సమష్టిగా ఈ విషయంపై దృష్టిసారించాలి.

– మిర్జా అహ్మద్ బేగ్, గోల్కొండ

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించం



గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన గోల్కొండ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని ఔట్ పేషంట్ రిజిస్ట్రేషన్ విభాగం, ఫార్మసీ, ఇంజక్షన్ రూమ్, ఔట్ పేషంట్స్ కన్సల్టేషన్ రూమ్‌లను సందర్శించారు. ముందుగా ఆయన ఫార్మసీ వద్ద మందుల కోసం నిలబడిన పేషంట్లతో మాట్లాడారు. వైద్యులు మీతో ఎలా మాట్లాడారు..రోగ వివరాలను అడిగి తెలుసుకున్నారా తదితర విషయాలపై ఆరా తీశారు. ఔట్ పేషంట్ రిజిస్ట్రేషన్ విభాగంలో ఉన్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో ఆయన మాట్లాడారు. ఆసుపత్రి పని చేసే వేళల్లో ఓపీ రిజిస్ట్రేషన్ విభాగంలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కచ్చితంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ఆయన ఆసుపత్రి ఇన్‌జక్షన్ విభాగం, ల్యాబ్ రిజిస్ట్రేషన్ విభాగం, ల్యాబ్‌లను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రికి ప్రతిరోజు వచ్చే ఔట్‌పేషంట్లు, ఇన్‌పేషంట్ యాక్యుపెన్సీ తదితర విషయాలపై ఆయన ఆసుపత్రి సూపరింటెండెంట్ పి.వి.శ్రీనివాస్‌రావును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, ఆసుపత్రి ఆర్‌ఎంఓ డాక్టర్ రాకేష్, మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

యువ టేబుల్ టెన్నిస్ క్రీడాకారులను ప్రోత్సహిస్తాం



యువ క్రీడాకారులతో నాగేందర్ రెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: యువ టేబుల్ టెన్నిస్ క్రీడాకారులను ప్రోత్సహిస్తామని తెలంగాణ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ తెలిపింది. సోమవారం తెలంగాణ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో టేబుల్ టెన్నిస్‌లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.నాగేందర్‌రెడ్డి మాట్లాడుతూ..యువ క్రీడాకారులు ఎప్పటికప్పుడు సీనియర్ క్రీడాకారుల సలహాలు, సూచనలు తీసుకోవాలని వారి నుంచి స్ఫూర్తిని పొందాలని సూచించారు. పారా, క్రీడాకారులకు కూడా మంచి అవకాశాలు ఉంటాయని తెలిపారు. క్రీడాకారులతో పాటు కోచ్‌లను కూడా గుర్తించి వారికి తగు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

'ఆదుకుంటే దేశానికి మరింత పేరు తెస్తా'

చార్మినార్: ఇంటర్నేషనల్ సైక్లిస్ట్ ఆఫ్ హైదరాబాద్‌గా పిలుస్తున్న శాలిబండ సైక్లింగ్ క్లబ్ విద్యార్థి ఆశీర్వాద్ సక్సేనా ప్రభుత్వం తరఫున తనకు సహాయ సహకారాలు అందిస్తే..మరిన్ని విజయాలు సాధించి దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకువస్తానని అంటున్నారు. ఈ మేరకు తాను తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్యం, సమాచార సాంకేతిక, స్పోర్ట్స్ విభాగాల ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్‌ను కలిసి ఆర్థిక సహాయంపై వివరించానన్నారు. ఇటీవల ఉత్తరాఖండ్‌లో జరిగిన 38వ జాతీయ ఆటల పోటీల్లో ఆశీర్వాద్ సక్సేనా కాంస్య పతకం సాధించారు. అలాగే జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ స్టేట్ సైక్లింగ్ అసోసియేషన్ తరఫున జరిగిన మాస్ స్టార్ట్ రోడ్ రేస్ పోటీలో విజయం సాధించారు. ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగిన క్రీడల్లో పాల్గొని ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్న సక్సేనా మరిన్ని జాతీయ, అంతర్జాతీయ అవార్డులు సాధించేందుకు



జయేష్ రంజన్‌ను కలిసి పరిస్థితి వివరిస్తున్న ఆశీర్వాద్ సక్సేనా

స్పాన్సర్లు అవసరమని తెలంగాణ స్టేట్ సైక్లింగ్ అసోసియేషన్ ప్రతినిధులు కోరుతున్నారు. అత్యంత ఆధునాతనమైన సైకిళ్లను ఖరీదు చేయడానికి రూ.35 లక్షల వరకు ఖర్చు అవుతున్నందున అటు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం చేయాలని ఆశీర్వాద్ సక్సేనా కోరుతున్నారు.

24న జానకి సినీ గీతాలాపన



ఎస్.జానకి

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శృతిలయ ఫౌండేషన్, సీల్‌వెల్ కార్పొరేషన్, ఆదర్శ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 24న రవీంద్రభారతిలో సినీ నేపథ్య గాయని ఎస్.జానకి జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్లు శృతిలయ వ్యవస్థాపక కార్యదర్శి ఆమని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జన్మదిన వేడుకల్లో భాగంగా ఎస్.జానకి సినీ గీతాలాపన కూడా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి, సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ, బండారు సుబ్బారావుతోపాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు తెలిపారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో సేవలందిస్తున్నవారికి ఉగాది విశిష్ట పురస్కారాలను సైతం ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. ఆదర్శ ఫౌండేషన్ 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక సంచికను విడుదల చేయనున్నట్లు తెలిపారు.

హరీశ్‌రావును కలిసిన జక్కుల లక్ష్మణ్



సిటీ కోర్టులు: మాజీ మంత్రి హరీశ్‌రావును సోమవారం బీఆర్‌ఎస్ లీగల్‌సెల్, నాంపల్లి క్రిమినల్ కోర్టు న్యాయవాది మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ తరఫున లీగల్‌సెల్ ఆధ్వర్యంలో సేవలు అందిస్తున్నందుకు న్యాయవాది జక్కుల లక్ష్మణ్‌ను హరీశ్‌రావును అభినందించారు. అదేవిధంగా ఈనెల 27న జరుగనున్న భారీ బహిరంగా సభ విజయవంతం కావాలని కోరారు.

గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్టు

గోల్కొండ: గంజాయికి అలవాటు పడిన యువకులు స్వయంగా గంజాయి అమ్మే ముఠాగా అవతారమెత్తారు. వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం..సోమవారం ఉదయం మాసాబ్‌ట్యాంక్ వస్టిలాన్సర్ ఈద్గా గ్రౌండ్ వద్ద కొందరు వ్యక్తులు గంజాయి తాగుతున్నారని సమాచారం అందడంతో వెస్ట్ జోన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జంగయ్య, హ్యూమాయిన్‌నగర్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్‌తో కలిసి పోలీసులు ఈద్గా గ్రౌండ్‌కు వెళ్లారు. అక్కడ గంజాయి తాగుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. మాసాబ్‌ట్యాంక్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్‌గా నమోదై ఉన్న మహ్మద్ సోఫియానుద్దీన్(24) సాయంతో మాసాబ్‌ట్యాంక్ పోచమ్మ బస్తీకి చెందిన సయ్యద్ దావుద్ అలీ, ఈద్గా గ్రౌండ్‌కు చెందిన సయ్యద్ రోమాన అలీ, కిషన్‌బాగ్‌కు చెందిన మహ్మద్ అయూబ్‌తో ఒక టీమ్ ఏర్పడ్డారు. వీరు మహ్మద్ సోఫియానుద్దీన్ ఆదేశాల మేరకు మహారాష్ట్ర నాగ్‌పూర్ తాజ్‌బాగ్ దర్గాకు వెళ్లి అక్కడ నుంచి గంజాయి తేవడం ప్రారంభించారు. ఇదిలా ఉండగా వీరు ఈద్గా గ్రౌండ్ వద్ద గంజాయి అమ్ముతున్నారని విషయం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు, హ్యూమాన్‌నగర్ పోలీసులతో కలిసి దాడి చేసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కిలోల గంజాయి, ద్విచక్ర వాహనం, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని వారిని సోమవారం రిమాండ్‌కు తరలించారు.

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలుచేయాలి

సిటీ కోర్టులు: న్యాయవాదులకు అండగా రక్షణ చట్టాన్ని అమలు చేయాలని అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని న్యాయవాదులు కోరారు. తన వ్యక్తిగత కేసులో సోమవారం నాంపల్లి క్రిమినల్ కోర్టుకు వచ్చిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. న్యాయవాదులు తమ విధులకు నిర్వర్తించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతి పత్రంలో కోరారు.



కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌వీ.రమణ, ఇతర న్యాయవాదులు

కొన్నేళ్లుగా న్యాయవాదులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, బెదిరింపులు చూస్తుంటే ఎప్పుడు ఏ న్యాయవాదిపై దాడి జరుగుతుందోనని భయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాంపల్లి క్రిమినల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవి కిషోర్, ఉపాధ్యక్షులు చంద్రమోహన్, రవీందర్, జనరల్ సెక్రటరీ ఎన్‌వీ రమణ, కోశాధికారి రవీందర్ నాయక్, జాయింట్ సెక్రటరీ హృదయనాథ్ అసూర్య, సభ్యులు స్రవంతి, శ్రీలత, ప్రణీత్‌సింగ్ పవార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలకు చెక్

అబిడ్స్: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలకు చెక్ పెట్టవచ్చని మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. కొన్ని ఏళ్లుగా సీసీ కెమెరాల వినియోగం పెరిగిపోవడంతో దొంగతనాలు తగ్గుముఖం పట్టాయన్నారు. అబిడ్స్ నేతాజీనగర్‌లో సీసీ కెమెరాల నెట్‌వర్క్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..ప్రతి బస్తీ, ప్రతి కాలనీలు ఇతర ప్రాంతాల్లో స్వచ్ఛందంగా స్థానికులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే వారికి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. అంతేకాక, స్థానిక వ్యాపారస్థులు సైతం తమ దుకాణాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దొంగతనాల నివారణకు ఏవైనా సంఘటనలు జరిగినప్పుడు నిందితులను పట్టుకునేందుకు సీసీ కెమెరాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న మేయర్ గద్వాల విజయలక్ష్మి

ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా, కాంగ్రెస్ నాయకులు సంతోష్ గుప్తా, గోవర్ధన్, బస్తీ నాయకులు పాల్గొన్నారు.

ఉర్దూఘర్‌లో చెస్ టోర్నమెంట్ ప్రారంభం



పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

చార్మినార్: మూడు రోజుల పాటు ఉర్దూఘర్‌లో జరుగనున్న ఓపెన్ రౌండ్ రాబిన్ చెస్ టోర్నమెంట్-2025 సోమవారం ప్రారంభమైంది. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. మొదటి రౌండ్‌లో మహ్మద్ షబ్బీర్ అహ్మద్, మహ్మద్ సాహిర్ అహ్మద్, షేక్ అఫ్రీదీ, ఖాలెద్ బిన్ యాయా తదితరలు విజేతలుగా నిలిచారని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 22, 23 తేదీలలో కూడా జరిగే పోటీల్లో విజేతలుగా నిలిచిన వారందరికీ 23న ఫైనల్ పోటీలుంటాయని తెలిపారు. విజేతలకు ఈ నెల 23న రాత్రి 7 గంటలకు ప్రశంసాపత్రాలతో పాటు నగదు బహుమతులను అందజేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ డాక్టర్ సమద్ ఉస్మానీ, ఆర్గనైజింగ్ సెక్రటరి సయ్యద్ అబ్దుల్ హైఖాద్రీ, డైరెక్టర్ సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

వరద సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

యాకుత్‌పురా: రాబోయే వర్షాలకు వరద నీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ సూచించారు. తలాబ్ చంచలం డివిజన్ పరిధిలోని తలాబ్‌కట్టా, అమన్‌నగర్-బీ, షా జహాన్ ఫంక్షన్, చాచాగ్యారేజ్, భవానీనగర్, నషేమన్ నగర్ తదితర ప్రాంతాల్లో సోమవారం ఆయన కార్పొరేటర్ సమీనా బేగం, జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షానికి డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిలవడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారన్నారు. రాబోయే వర్షా కాలంలో వరద నీటి సమస్యలు రాకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.



బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, కార్పొరేటర్ సమీనా బేగం

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

చార్మినార్: ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ జోనల్ జాయింట్ కమిషనర్ శంకర్ సింగ్ కోరారు. జోనల్ కమిషనర్ వెంకన్న పర్యవేక్షణలో జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంతోష్ నగర్, చార్మినార్, ఫలక్‌నుమా సర్కిల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై 3, పారిశుధ్య సమస్యపై 2, వీధి దీపాల సమస్యపై 1, ఆస్తి పన్ను సమస్యపై 1 మొత్తం 7 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా శంకర్ సింగ్ మాట్లాడుతూ..ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో తమకు అందిన ఫిర్యాదులను పరిశీలించి వాటిని తక్షణమే పరిష్కరిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు అందిన ఫిర్యాదులను సంబంధిత విభాగాలకు పంపించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ మహమ్మద్ అబ్దుల్ మాజీద్, ఏఎంసీ రాజారావు, వెటర్నరీ సీనియర్ అసిస్టెంట్ హమీద్, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికుల వ్యాక్సినేషన్ క్యాంప్ ప్రారంభం

గోల్కొండ: హజ్ యాత్రకు ఎంపికైన వారికి ప్రభుత్వపరంగా అవసరమైన అన్ని పనులు సకాలంలో పూర్తి చేయిస్తామని రాష్ట్ర వక్ఫ్ బోర్డు కార్యానిర్వహణ అధికారి సజ్జిద్ అలీ అన్నారు. సోమవారం ఈ సంవత్సరం హజ్ యాత్రకు ఎంపికైన వారి కోసం గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వ్యాక్సినేషన్ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతంలో వ్యాక్సినేషన్ కేంద్రాల సంఖ్య తక్కువగా ఉండేదని దీని వల్ల హజ్ యాత్రికులు గంటల తరబడి క్యూలో నిలపడేవారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హజ్ యాత్రికుల కోసం వ్యాక్సినేషన్ కేంద్రాలను పెంచిందన్నారు. దీని వల్ల హజ్ యాత్రకు వెళ్లే సీనియర్ సిటిజన్స్, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి వైద్య పరీక్షల నిమిత్తం క్యూలు కట్టే తిప్పలు తప్పాయన్నారు. గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో ఐదు రోజుల పాటు వ్యాక్సినేషన్ సెంటర్ ఉంటుందన్నారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడి ఈ వైద్య శిబిరాలు సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు. కాంగ్రెస్ నాయకులు హబీబ్ జైనులాబీద్దున్ ఆబీద్, ఇలియాస్ అలీ, మోహిన్, రాష్ట్ర హజ్ కమిటీ ఏఈఓ ఇర్షాద్ తదితరులున్నారు.



హజ్ యాత్రికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఐఎన్‌టీఎస్‌ఓలో సత్తాచాటిన విద్యార్థులు



ఐఎన్‌టీఎస్‌లో సత్తాచాటిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ స్వాతి తదితరులు

గోల్కొండ: జాతీయ స్థాయిలో నిర్వహించిన ఐఎన్‌టీఎస్‌ఓ పరీక్షలో మెహిదీపట్నం శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు ప్రతిభచాటారు. జాతీయ స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో గెలిచిన వారికి సోమవారం పాఠశాలలో ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. ఈ పరీక్షల్లో ఒకరికి మొదటి బహుమతిగా ల్యాప్‌టాప్, ద్వితీయ బహుమతి ఇద్దరు సాధించారు. అదే విధంగా మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో కూడా తమ విద్యార్థులు బహుమతులు గెలిచారని ప్రిన్సిపాల్ స్వాతి తెలిపారు. తమ పాఠశాలకు చెందిన మొత్తం 181 మంది గోల్డ్ మెడల్స్ సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం కృష్ణ, ఆర్‌ఐ హరికృష్ణ, డీన్ మల్లేష్, ఇన్‌చార్జీలు బాలరాజు, చబుస్తా, నదీమ్, రవి, కో ఆర్డినేటర్ ప్రవీణ్, జైపాల్‌రెడ్డి తదితరులున్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి



సయ్యద్ ఫయాజ్, ఏసీపీ

గోల్కొండ: సైబర్ నేరగాళ్ల రోజురోజుకూ తమ పంథా మారుస్తూ ఆర్థిక దోపిడీకి కొత్త బాటలు ఎంచుకుంటున్నారని అటువంటి వారితో జాగ్రత్తగా ఉండాలని గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. గోల్కొండకు చెందిన ఓ వ్యక్తి కేవలం ఫోన్‌పై మీకు హల్దిరామ్ డీలర్‌షిప్ ఇప్పిస్తామంటూ కోల్‌కత్తకు చెందిన ఓ వ్యక్తి రూ.75 లక్షలు దోచుకున్నాడని ఆయన అన్నాడు. అదే విధంగా నకిలీ ఇంటి, భూమి డాక్యుమెంట్లు తెచ్చి వాటిని ఒరిజినల్‌గా నమ్మిస్తూ అమ్మజుపుతున్నారని అటువంటి వారిపై జాగ్రత్తగా ఉండాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైబర్ నేరాలు, నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని ఎన్నో రకాలుగా ప్రచారం చేస్తుయాన్నారు. అయినా కూడా అత్యాసకు పోయి కొందరు అమాయకులు సైబర్ నేరగాళ్ల ఊబిలో చిక్కుకొని డబ్బులు పొగొట్టుకుంటున్నారన్నారు. ఫోన్‌లో కపట మాటలతో ఎక్కువ డబ్బులు ఇప్పిస్తామంటూ ఎరవేస్తున్నారని తక్కువ ధరకే ఇళ్లు, ప్లాట్లు ఇప్పిస్తామని ఓటీపీ ద్వారా బ్యాంకు ఖాతాల్లో ఉన్న డబ్బులుకాజేస్తున్నారన్నారు. ఇటువంటి కాల్స్ వస్తే వెంటనే సైబర్ కార్యాలయాలకు స్థానిక పోలీసులకు తెలపాలన్నారు.